# కావేరి

కావేరి పుట్టిన అరగంటకి వాళ్ళ నాన్న చెరువుగట్టున పాము కరిచి చచ్చిపోయాడు. కావేరి జీవితంలో దురదృష్టం మొదటిసారి కాటువేసిన సందర్భం అదే.

అది కావేరీ తప్పుకాదు. అయినా అక్కయ్యలంతా ఆ అమ్మాయిని ఆడిపోసుకునే వారు. తల్లి మాణిక్యం మాత్రం ఆమెను ఆ నిందనుంచి గొడుగులాగ కాపాడుకుంటూ పెంచింది. ఎప్పుడన్నా భర్తని తలుచుకొని కన్నీరు కారిస్తే తప్పనిసరిగా నలుగురూ కావేరిని తిట్టిపోస్తారని భర్తపోయిన దుఃఖాన్ని రహస్యంగానే అనుభవించేది. ప్రతీ ఏడూ కావేరీ పుట్టిన రోజుని మెత్తటి కన్నీళ్ళ మధ్య రహస్యంగా జ్ఞాపకం చేసుకొనేది.

పోతరాజు పొట్టకూటి కోసం చాలా ఏళ్ళ కిందటే తంజావూరు వలసపోయాడు. అక్కడేదో కాంట్రాక్టులో రాళ్ళు మోసేవాడు. అతను చనిపోయాక యిప్పుడిక రాళ్ళు మోసే పని ఎలాగూ లేదుగనక—మాణిక్యం కుటుంబ భారాన్ని మోసుకొంటూ తమ ఊరికి వచ్చేసింది.

పుట్టిన తొలిరోజుల్లో కావేరి తల్లి 'పాపా' అని మిగతా వాళ్ళు 'పాపీ' అని పిలిచేవాళ్ళు. ఆ దుఃఖంలో ఆమెకి పేరు పెట్టడం మరిచిపోయింది. మాణిక్యం. పాప పుట్టినరోజు ఆమెకి బాగా గుర్తు. నిండు చూలాలు. నలుగురూ వద్దంటున్నా బరువెక్కిన శరీరంతో, దగ్గరలో ఉన్న కావేరీ నదిలో స్నానం చేసి వచ్చింది. ఆ తర్వాత మరి కొన్ని గంటల్లో పాప భూమి మీద పడింది. అందుకని—ఎప్పుడో రహస్యంగా మనస్సులోనే పాపకు 'కావేరి' అని పేరు పెట్టుకుంది.

తనకి జ్ఞానం వచ్చాక—అక్కయ్య చేతులకి వెండి కడియాలు, ముక్కులకి

నత్తులూ ఉండడం తెలుసు – అమ్మ మెడలో పెద్ద వెండి గొలుసు ఉండేది. కాని క్రమంగా అవన్నీ మాయమయ్యాయి. ఒకరోజు ఎవరో తీసుకువచ్చి ఒక ఆవును ఇంటి ముంగిట్లో కట్టారు. అమ్మ ముఖంలో ఆనాటి సంతోషం గుర్తింది. ఆవు ముఖానికి పసుపురాసి బొట్టు పెట్టడం అమ్మ తనకి నేర్పింది. దానికి లక్ష్మి అని పేరు పెట్టింది అమ్మ.

అప్పటి నుంచీ కావేరీ జీవితంలో ఒక పద్ధతి ఏర్పడిపోయింది. ప్రతిరోజూ ఉదయమే పేడ తియ్యడం, పిడకలు చేయడం, పాలు పితకడం, చిందరవందరగా ఉండే పాకని ఒక దారికి తీసుకురావడం అదే తన పని. తనకి సంబంధం లేని తన పుట్టుకని ఆధారం చేసుకుని అక్కయ్యలు తన మీద అజమాయిషీ చేసేవారు. అందరూ ఉదయమే చల్దితిని పొలాల్లోకి ఆటలకి పోయేవారు. ఇంటి దగ్గర తనూ అమ్మా, లక్ష్మీ. పాలు పితికినప్పుడల్లా ఆ గుమ్మపాలు తాగాలని నోరూరేది. కాని అవి తాగే అర్హత తమకు లేదని అమ్మ గుర్తు చేసేది. పాలు పితికేవేళకే అవి తమ హక్కయినట్టుగా నలుగురయిదుగురు వచ్చి ఆ పాలు తీసుకుపోయేవారు. నాయుడుగారి అబ్బాయి మరీ పొగరుగా తన దగ్గరే నిలబడి పాలు పితికే కుండని పదిసార్లు తనిఖీ చేసి మరీ పితకనిచ్చేవాడు. తమ లక్ష్మి – రోజూ సేవ చేసి పెంచి పాలు పితికితే వాళ్ళకి ఎందుకివ్వాలో అర్థమయేది కాదు కావేరికి. ఓరోజు నాయుడుగారి అబ్బాయితో తగాదా వేసుకొంటే అమ్మ కోప్పడింది. వాళ్ళు తమకి తిండిపెట్టే ప్రభువులు అంది. కావేరికి ఆ పసితనంలో అర్థంకాని సత్యాలలో అది మొదటిది. తాము తిండిపెట్టి పెంచే లక్ష్మిపాలు తీసుకువెళ్తున్న వాళ్ళు తమకెలా తిండి పెడుతున్నారా అన్నది.

కావేరి పసి జీవితంలో అపురూపమయిన జ్ఞాపకం లక్ష్మి చిన్న తువ్వాయిని ఈ లోకంలోకి తీసుకురావడం. తల్లితోపాటు చలిలో, పాకలో కూర్చుంది ఆ రాత్రి. మలిజాముకో చిన్న కునుకు పట్టింది. లక్ష్మి 'అంబా' అనే కేకకి తెలివొచ్చింది. చూస్తే మరోజీవి ఈ ప్రపంచంలోకి వచ్చింది. అమ్మ ఆ రాత్రి అంతా పాకలోనే ఉంది. తనని దగ్గరికి చేరనివ్వలేదు. ఆ నోరులేని తువ్వాయి కావేరి జీవితంలో మొదటి నేస్తం.

లక్ష్మికాక ఇంటినిండా పదిపన్నెండు కోడిపెట్టలుండేవి. రెండు పూటలా వాటిని వెదికి వాటికి తిండి పెట్టడం, అవి ఏమూలో పెట్టిన గుడ్లన్నీ ఏరుకు రావడం కావేరి దినచర్యలు. ఆవు, కోడిపిల్లలతో పాలు, గుడ్లు అమ్మి ఆ యింటిని సాకేది మాణిక్యం. గుట్టుమట్టుగా ఆ సంసారాన్ని చాలా సంవత్సరాలు ఈదుకొచ్చింది. ఆ సంపాదనతో కేవలం పరికిణీతోనే నిద్రపోయేది. చెరువుగట్టుకు మరీ పొద్దున వెళ్ళి ఎవరూ లేని చెట్లమాటున ఆ రెంటిని ఉతుక్కొని ఆరేసుకు కట్టుకుని వచ్చేది. అక్కయ్యలు మాత్రం వయస్సు మీరిన కొద్దీ అప్పుడప్పుడు షోకులు చేసేవారు. ఉన్నట్టుండి పువ్వుల పరికిణీ, జాకెట్టు వేసుకొనేవారు. అవి ఎలా వచ్చాయో అమ్మ అడిగేది కాదు. తనని అడగనిచ్చేది కాదు.

లేమి బయటికి కనిపించకుండా, ఉన్నంతలో కాలం గడపడమే ధ్యేయమయినట్టు ఆ కుటుంబం సాగిపోయేది. అలా ఎంతకాలం?

ఆ ఊరికి ఎలక్ట్రిసిటీ వచ్చిన తొలిరోజులు. ఆఫీసర్లూ, పనివాళ్ళూ, బళ్ళూ విసురుగా అటూయిటూ తిరిగేవి. అక్కయ్యలకి తీరిక ఉండేది కాదు. పనివాళ్ళ మధ్య

పడిపోతూ—అక్కడే రోజంతా ఉండేవారు. ఒకరోజు ఊళ్ళో ఎలక్ట్రిక్ దీపాలు గుప్పుమన్నాయి. ఆ రోజునే రాత్రి వూళ్ళో అందరికి విందు జరిగింది. కావేరీ, మాణిక్యం పంక్తిలో చివర చేరి తృప్తిగా భోజనం చేశారు. బాగా చీకటి పడ్డాక యిద్దరూ యింటికి చేరారు. ఆ రాత్రి పెద్దక్కయ్య యింటికి చేరలేదు. ఆ తర్వాత మరెప్పుడూ కనిపించలేదు.

ఆ రాత్రే వెళ్ళిపోయిన ఎలక్ట్రీ పనివాళ్ళతో సీతాలూ వెళ్ళిపోయిందని తర్వాత పదిమందీ అనుకున్నారు. నలుగురు నాలుగు విధాలుగా తిట్టారు. కాని మాణిక్యం నోటి వెంబడి పల్లెత్తు మాట రాలేదు. కన్నీళ్ళు కారలేదు. మాణిక్యం కన్నీరు చాలా విలువయినది. దాన్ని భర్త చావుకీ, కావేరి దురదృష్టానికి దాచుకో గలిగింది.

వెళ్ళిపోయిన అక్కయ్య గురించీ కావేరీ కన్నీరు కార్చలేదు. కాని సందడిగా ఉన్న పాక చిన్నబోయినట్టయి దిగులుపడిపోయేది.

పెద్దక్కయ్య వెళ్ళిపోయినప్పట్నుంచీ మళ్ళీ యింటి పరిస్థితులు తొందరగా మారిపోయాయి. నాయుడుగారు ఒకసారి తల్లిని నిలదీసి రెండో కూతురికి పెళ్ళిచెయ్యమని శాసించాడు అది తనపని అయినట్టుగా. మాణిక్యం కూడా రెండో నష్టానికి సిద్ధపడే స్థితిలో లేదు. అందుకని నాయుడుగారి పాలేరుకిచ్చి ఓ రాత్రి గంగానమ్మ గుడిదగ్గర పుస్తె కట్టించేసింది.

నరసింలు చాలా నిజాయితీ మనిషి. మంచినీ, చెడునీ మనసులో దాచుకొనే తరహా కాదు. కష్టాన్నీ సుఖాన్నీ పదిమంది ముందూ పరిచే బాపతు. పెళ్ళినాడే కమ్మని కల్లు తాగివచ్చి చిన్నక్కని చావబాదడం ఎప్పటికీ మరిచిపోలేదు కావేరి.

కొన్ని చెక్కలు పుట్టుక సరిగ్గానే ఉంటుంది. వాటికి రంపపు కోత అయాక మీద బరువేదో ఉంచాలి. లేకపోతే వేడికీ, గాలికీ అవి వంగిపోయి ఉపయోగపడకుండా పోతాయి. ఆ బరువు చిన్నక్కకి నరిసింలు రూపంలో లభించింది. పెద్దక్క ఎందుకూ పనికిరాకుండా పోయింది. నరసింలు ఆమెను చావబాదడం ఆమె రోగానికి సరయిన మోతాదులో పనిచేసింది. అప్పటినుంచీ ఆమె గంగానమ్మనే నమ్ముకుంది.

ఇంతింట్లో తనూ, తల్లీ మిగిలారు. ఆ పండక్కి మొదటిసారిగా పువ్వుల పరికిణీ కొంది తల్లి. ఆ పండక్కే మొదటిసారిగా సర్కసు లారీ వచ్చింది. రెండు కోతులూ ఒక ఎలుగు బంటీ, మరీ ఒంట్లో ప్రాణంలేని యిద్దరు ఆడపిల్లలతో – దొర టోపీ పెట్టుకున్న సాయిబు ఆ సర్కసు లారీని వేసుకొచ్చాడు. లారీ కాంట్రాక్టు. దాని డ్రైవరు రాజు. సర్కసుకీ తనకీ ఏమీ సంబంధం లేనట్టు దూరంగా పోయి బీడీ వెలిగించుకు కూర్చొనేవాడు. పచ్చగా దబ్బపండులాగ మెలితిర్గిన మీసాలూ, జబ్బకి సాయిబాబా బిళ్ళా, నల్లబనీనూ – నిండుగా ఉండేవాడు. ఆ వూరుకి లారీ రావడం అదే మొదటిసారి. ఆ పండగ నాలుగు రోజులూ వూళ్ళో వాళ్ళంతా సాయిబు సర్కసుకి కాక కొత్త లారీని తెచ్చిన రాజునీ, అతని లారీని చూస్తూ గడిపారు. దానికి టిక్కట్టులేదు గనుక–అలా రాజుని చూసి రెచ్చిపోయిన చాలామందిలో కావేరి కూడా ఉంది.

కావేరికి ప్రేమ, ఆకర్షణ ఇలాంటివేమీ తెలియవు. తెలియవలసిన అవసరం లేదు.

కాని రాజు తనతో ఒకసారి మాట్లాడితే బాగుణ్ణనిపించింది. ఆ పనివాళ్ళు రేపెళ్ళి పోతారనగా జరిగింది. బీడీ వెలిగించుకొని జేబులు వెదుక్కొని "ఏయ్ పిల్లా – అగ్గి తెస్తావా?" అన్నాడు తనని చూసి. ఒక్క క్షణం అర్థం కాలేదు. "నిన్నే" అన్నాక పరుగుచ్చుకుంది. ఒక్క పావుగంటసేపు యిల్లంతా వెదికి మట్టిగొట్టుకుపోయి తడిసిన అగ్గిపెట్టె పట్టుకుని మళ్ళీ బజారువేపు పరుగుదీసింది. అప్పటికే బీడీ పొగ వదుల్తున్నాడు రాజు. పక్కన నలుగురయిదుగురు మనుషులున్నారు. తాను మాట్లాడక అగ్గిపెట్టె అందించింది. అది చూసి ఒక్క క్షణం తెల్లబోయి ఫకాల్న నవ్వేశాడు రాజు. తర్వాత జుత్తంతా పొదివి పట్టుకొని "అగ్గిపెట్టె తెచ్చావా లంజా! ఎంత త్వరగా తెచ్చావే!" అన్నాడు.

తనకా మాటలకి కోపం రాలేదు. కాని ఆ వ్యక్తి చాలా పొగరున్న మనిషని అర్థమయింది. జుత్తు విదిలించుకొని మెలికలు తిప్పింది.

ఆమె బిక్కమొహం చూసి రాజుకి ముచ్చటేసినట్లుంది. కనుకొనుకుల్లో నీళ్ళు చూశాడేమో "ఏడవకే, ఎప్పుడన్నా నేను పెళ్ళంటూ చేసుకొంటే నిన్నే చేసుకుంటాలే" అని పగలబడి నవ్వాడు.

అలాంటి మాట తనతో ఎప్పుడూ ఎవరూ అనలేదు. 'పెళ్ళి' అనగానే గంగానమ్మ గుడి, నరిసింలు, పచ్చికల్లు, చిన్నక్క గుర్తుకొచ్చారు. భయమేసి పారిపోయింది కావేరి అక్కడనుంచి.

మర్నాడు సర్కసు అక్కడినుంచి వెళ్ళిపోతుందని తెలిసినా అటు వెళ్ళలేదు. కాని లారీ దూరాన పొలాల పక్క మలుపు తిరిగాక పరుగున బజారు పక్క మైదానం వేపు పరుగు తీసింది. అదంతా ఖాళీ అయిపోయింది. ఇప్పుడక్కడెవరూ మనుషులు లేరు. రోజు రాజు కూర్చునే చోట సరుగుడు చెట్టు మొదట్లో అతను కాల్చేసిన బీడీ ముక్కలున్నాయి. తనూ అక్కడే కూర్చుని తనకి అంకెలు తెలిసిన మేరకు బీడిల్ని లెక్కపెట్టింది. పదికి మించి ఉన్నాయి. తనకి పది తర్వాత ఏమిటో తెలీదు. అలా దిగాలుపడి అక్కడే కూర్చుంది. జీవితంలో అక్కడ కూర్చుని ఏడ్చేసింది కావేరి.

ఆ రాత్రి ఎంతోసేపటికి కాని తెల్లవారలేదు.

కోడి కూర కమ్మటి వాసనకి గభాలున తెలివొచ్చింది కావేరికి. ఇది ఆ పాకలో ఎప్పుడూ తగలని కొత్త రుచి. లేచి చటుక్కున అమ్మ దగ్గరికి పరిగెత్తింది. పెరట్లో ఎవరో కొత్త మనిషి తిరుగుతున్నట్లు కనిపించాడు. ఎండుతాటి రెమ్మల చాటున రాజు పలుదోమ పుల్ల నమలడం కనిపించింది. తెల్లబోయింది కావేరి.

అమ్మ అంతా చెప్పింది. ఊరుదాటిన రెండు మైళ్ళకి లారీ టైరు పగిలిపోయిందట. ఆ చలిలో అక్కడ ఉండలేక మనిషిని పట్నానికి పంపించి తను ఈ ఊరు వచ్చాడట. సాయిబుని లారీ దగ్గర వదిలి ఊరుకి బాసటగా ఉన్న తమ తలుపు మూడోఝామున తడితే పాకలో నులకమంచం వేసి పడుకోమందిట. ఉదయమే కోడిపెట్టల్ని చూసి అయిదు రూపాయలు తీసి యిచ్చాడట కూరవండి పెట్టమని.

ఒక్కడూ కూరంతా తిన్నాడు రాజు. కావేరి విస్తుపోయి గుమ్మానికి చేరబడి నిలబడి చూస్తోంది.

అసలు కావేరిని చూడగానే రాజు తెల్లబోయాడు. "ఆ రోజు అగ్గిపుల్ల తెచ్చిన పిల్లవి నువ్వేకదూ?" అనడిగాడు.

అది ప్రశ్నకాదు. హుంకారం, గొంతులో అంత తీవి, బలం. అవునని తలూపింది.

"దీన్నే పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చానత్తా" అన్నాడు రాజు మాణిక్యంతో నవ్వుతూ.

ప్రతీ విషయాన్ని తేలికగా తీసుకుంటాడనీ, మాటకి ముందు ఆలోచన ఉండదనీ, మాట అన్నాక దాని అర్థం అవగాహన చేసుకు ఆనందిస్తాడనీ అర్థమవుతోంది.

"నిజంగా చేసుకుంటావా బాబూ!" అంది మాణిక్యం ఆశగా. ఆమెకు మాటకు ఒకే అర్థం తెలుసు.

"అది నాకు రోజా అగ్గిపుల్ల అందించి నువ్విలా కోడికూర చేసిపెడతానంటే పెళ్ళికేం, భేషుగ్గా చేసుకొంటాను. నాకు ఎలాగూ ఓ పెళ్ళాం కావాలి" అన్నాడు.

కావేరి తర్వాత అక్కడ నిలబడలేదు.

మళ్ళీ పొలాల మధ్య నుంచి నడిచి వెళ్తూ వరిచేను పక్క పల్లంలో తనని చూసి 'ఏయ్ అం....!' అని పిలిచాడు రాజు. తను పారిపోయేలోగానే జుత్తు పట్టుకున్నాడు. ఆ బలమైన చేతుల్లో పిట్టలాగ యిరుక్కుపోయింది కావేరి.

"నిన్ను పెళ్ళి చేసుకోమని మీయమ్మ చెప్పిందే" అన్నాడు బులిపిస్తున్నట్లు.

కావేరికి కళ్ళెత్తే ధైర్యం లేకపోయింది. మరో క్షణంలో పెదాలు కందిపోయేటట్టు కొరికేశాడు. కావేరి బాధతో కెవ్వుమంది. ఆ కేక అతని నోట్లోనే మాయమయింది.

ఆవిధంగా కావేరి సుఖం మొదటిసారిగా బాధ, మేళవింపుతో ప్రారంభమయింది.

తనని వదిలి వెళుతున్న రాజుని ఒక్కమాట ఎంతో ప్రయత్నం మీద అడిగింది.

"మళ్ళీ సర్కసు ఎప్పుడొస్తుంది మా వూరికి?"

రాజు ఆగి నవ్వాడు. "సర్కసు రాదే. నేనే లారీతో వస్తా నీకోసం. నువ్వు మంచి బంగారం నగ పెట్టుకుని సిద్ధంగా ఉండు. పెళ్ళి చేసుకు ఊరికి తీసుకుపోతా" అనేసి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రోజులెలా గడిచాయో గుర్తు లేదు కావేరికి. రాజు పెదవులు కొరికిన విషయం అమ్మకి చెప్తే నవ్వి కోప్పడింది. అలాంటి విషయాలు ఎవరికీ చెప్పకూడదని.

కావేరి జీవితంలో మరొకరి సూచన కారణంగా తొంగి చూసిన మొదటి రహస్యమిది.

కాని పెద్దక్క పోలికలు కావేరికి వచ్చాయని, కొన్నాళ్ళపాటు ఆ పాకలో ఆకలికి స్థానం ఉండదని నిట్టూర్చింది తల్లి.

---

ప్రభవ, *1976*